


# కళారాధకులు

రచన: ఎ. సూర్యారావు

"మిస్ సులోచన వున్నారా?"

"లేరు."

మూడవ రోజున కూడా అరుణ్‌కు యిదే సమాధానం వచ్చింది. నిరాశతో వెళ్లిపోయాడు. అతను వెళ్లిన కొన్ని క్షణాలకు లోననుండి ఒకామె నవ్వుతూ వచ్చింది. ఆమే మిస్ సులోచన. అమెచ్యూర్ నాట్యమండలిలో అగ్రస్థానం ఆమెదే!

"రాఘవా! ఎవరే నాకోసం వచ్చారు?" ఆమె సహచరిణిని అడిగింది.

"మన నాట్యమండలి కవిగారు!"

"ఓహో అరుణా!" ఆమె సంతోషం ఒక్కసారిగా ఆగిపోయింది. అరుణ్‌ను ఆమె మొదటిసారిగా "చంద్రిక" రిహార్సల్సు జరిగేటప్పుడు చూసింది. తొలి చూపులోనే ఆమె హృదయం కలవరపడింది. కాని ఆమె వెంటనే మనస్సును అదుపులో పెట్టుకొంది. చంద్రిక పాత్రను గురించి నటనను గురించి అరుణ్ చెబుతున్నప్పుడు ఆమె పూర్తిగా పరధ్యానంగా వుంది. కాని చివరకు పాత్రలో లీనమై చక్కగా అభినయించింది. అరుణ్ రిహార్సల్సుకేగాని నాటకాలకు వెళ్లడు ఎంతో అవసరమైతే గాని ఎవరితో మాట్లాడడు. ఎప్పుడూ మౌనంగానే వుంటాడు. అతను ఏమి మాట్లాడినా అందరూ శ్రద్ధగా వింటారు. ఒక్క నాట్యమండలి విషయం మినహా ఏవిషయంలోనూ అతను కలగ చేసుకోడు. అటువంటి అరుణ్ తన యింటికి వచ్చాడంటే ఏదో తగిన విశేషం వుండాలి. సమయం సందర్భం లేకుండా నిత్యం వచ్చే యువకులకు చెప్పే సమాధానమే రాఘవ అరుణుకు కూడా చెప్పింది.

"ఈసారి అరుణ్ వస్తే లోనకు పంపించు." అని సులోచనలోనికి వెళ్లింది. కానీ అరుణ్ తిరిగి ఆమె యింటికి రాలేదు. పదిహేనవ తేదీని "చిత్రరేఖ" రిహార్సలు. అతను ఎందుకు వచ్చాడో ఆ రోజున తెలుసుకోవాలనుకొంది. —

రిహార్సల్సు విషయం జ్ఞాపకం చెయ్యడానికి రంగారావు వచ్చాడు. నాట్యమండలి స్థాపకుడు ఈయనే, బాగా డబ్బున్నవాడు. నాట్యకళమీది అభిమానంవల్ల ఈయన నాట్యమండలి స్థాపించాడని పత్రికలు రాస్తాయి. కానీ అది అనుమానించవలసిన విషయం. సులోచన ఆయనను యథోచితంగా సత్కారం చేసి కుర్చో బెట్టింది.

"రేపటి రిహార్సల్సుకు సిద్ధంగా వున్నావా?"

"చాలావరకూ— మిగత వాళ్లంతా కూడా సిద్ధంగా వున్నారనుకుంటాను."

"అందరూ సిద్ధంగానే వున్నారు. కవి మాత్రం రాడు."

"అదేం ? ఆయనెందుకు రారు?" ఆశ్చర్యంగా అడిగింది.

"రెండురోజుల క్రితం నా దగ్గరకు వచ్చి వందరూపాయలు అప్పు కావాలన్నాడు. లేవన్నాను. వారంరోజులు సెలవు పెట్టి వెళ్ళిపోయాడు."

"పాపం! యివ్వలేక పోయారా?"

"సులోచనా! నీకు ఈ కవుల విషయం తెలియదు. మాతాతగారు ఎప్పుడూ వాళ్ళ గురించే చెప్పేవారు. ఆయనకో ఎస్టేటు వుండేది. అదనంగా కవులకు యెప్పుడూ డబ్బు యివ్వకూడదని ఆయన చెప్పేవారు. వాళ్ళ చేతుల్లోంచి డబ్బు పోవడమేగాని రావడం వుండదు;"

"అరుణ్‌కు జీతం యెంత ఇస్తారు?"

"నెలకి యాభైరూపాయలు,"

"ఎంత అన్యాయం! నాటకంలో నటించే నటికి నాకు నెలకు రెండువందల రూపాయలు; నాటకాన్ని సృష్టించిన కవికి యాభైరూపాయలూనా?"

"ఈ రోజులలో కవులకేంలోటు? నీవంటి సర్వాంగ సుందరి నటిగా దొరకడం యెంతకష్టం!" అతను ఆమెవైపు ఓరగాచూస్తూ అన్నాడు.

సమాధానంగా ఆమె అతనిపై ఓ చిరునవ్వు విసిరింది.

"రేపు ఉదయం కారు పంపిస్తాను తిన్నగా నాట్యమండలికి రా?"

రంగారావు వెళ్ళిపోయాడు.

రిహార్సల్సుకు అరుణ్ తక్క అందరూ వచ్చారు. రిహార్సల్సు అయిన తరువాత సులోచన, రాధనుపిలిచి అరుణ్ యెక్కడకు వెళ్ళాడో తెలుసా అని అడిగింది.

"అరుణ్ చాలా విచిత్రమైన మనిషి. అతని దగ్గర పనిచేసే ముసలమ్మ మనుమరాలికి పెళ్ళట. వందరూపాయలుంటే గాని ఆ పెళ్ళి అవ్వదట. ఆమె చాలా బీద మనిషి. ఆ వందరూపాయలూ తను యిస్తానని అరుణ్ వొప్పుకున్నాడు. ఆడబ్బు కోసం మూడురోజులు అందరి యిళ్ళూ తిరిగాడు. యెవరూ యివ్వలేదు. ఏవూరో వెళ్ళాడు." అని చెప్పాడు రాధ.

"ఈ సారి అరుణ్ కనిపిస్తే దయచేసి నాదగ్గరకు పంపండి!" అని చెప్పి రంగారావుగారి కారుపై సులోచన తన యింటికి వెళ్లిపోయింది.

అరుణ్ శెలవు పెట్టిన వారంరోజులూ ఐపోయినవి. కానీ అతను రాలేదు. ఆఖరు రిహార్సల్సుకు అతను తప్పకుండా హాజరవ్వాలి. ఆరోజు కూడా అతను రాలేదు. సులోచన రాధనుపిలిచి అడిగింది. "అరుణ్ విషయం ఏమైనా తెలిసిందా"

"మద్రాసునుంచి ఉత్తరం రాశాడు. మరో వారంరోజుల వరకూ తను రాలేనని. ఆ ఉత్తరం చూడగానే రంగారావుగారికి కోపం వచ్చింది. సెలవు పెట్టిన రెండు వారాలకు జీతం యివ్వవద్దని గుమాస్తాకు చెప్పారు" అన్నాడు రాధ.

"అతనికి సెలవు పొడిగించ వలసిన అవసరం ఏమొచ్చిందో?"

"డబ్బుకోసం తిరుగుతున్నాడనుకుంటాను."

"రంగారావుగారికి ఈకవి యెలా దొరికాడు ?"

"అరుణ్ పేరుతో చాలాపత్రికలలో కథలూ, నాటికలూ ప్రకటించబడుతూ వుండేవి. అతని ప్రతి రచనలోనూ ఈనాటి సమాజం ప్రతిబింబిస్తుంది. గంభీరమైన భావాలు, సమాజంలోని లోపాలు అంతచక్కగా చిత్రించగల రచయిత నాకు కనిపించలేదు. ఒక పత్రికలో సీరియల్‌గా ప్రకటించబడిన 'చంద్రిక' నాటకం మమ్మల్ని ఆకర్షించింది. వెంటనే ఆ పత్రికకు ఉత్తరంరాసి అరుణ్ ఎడ్రస్ తెలుసుకున్నాం. ఏదో ఒక పల్లెటూరులో వుంటున్నాడు. అదిఅతని స్వగ్రామంకూడా కాదు. ఉత్తరం రాయగానే వచ్చాడు. రంగారావుగారు అతనిని ప్రత్యేకంగా మన నాట్యమండలి కవిగా ఉండమన్నారు. అతను ఒప్పుకున్నాడు. జీతం విషయం అసలు మాట్లాడనే లేదు. అరుణ్ వచ్చిన నెలరోజులకు మీరు వచ్చారు."

"అతనికథ వినేకొద్దీ వింతగా కనిపిస్తోంది. అతనిని నేను రిహార్సల్సు జరిగేప్పుడు మినహా యెప్పుడూ చూడలేదు. అతను యెక్కడ ఉంటున్నాడు ?"

"టౌన్‌హాల్ వెనుక చిన్న సందులో వుంటున్నాడు. అతని యింటిలో ఒక నౌకరుమాత్రం ఉంది. ఆమె చాలా ముసిలిది. ఆమెను ఆత్మబంధువులా చూస్తాడు గాని నౌకరులా చూడడు. యెప్పుడూ ఏదో రాస్తూనో, చదువుతూనో కూర్చుంటాడు. సాయంత్రం ఒక్కడూ బీచిలో సముద్రాన్ని, కొండల్ని చూస్తూ మౌనంగా కూర్చుంటాడు. యించుమించుగా రోజంతా మౌనంగా గడుపుతాడు. చాలాసార్లు నేను అతని యింటికి వెళ్ళాను. చాలాసార్లు బీచికికూడా వెళ్ళాను. ఏ విషయం గురించి అయినా మనం అడిగితే సమాధానం చెబుతాడు. అంతేగాని తనంతట తాను మాట్లాడే అలవాటు అతనికి లేదు."

"జీవితంలో ఎక్కువ కష్టాలు అనుభవించిన ప్రాణికి బుద్ధి యెక్కువగా వికసిస్తుంది. ఇతని జీవితం యెన్నో విశేషాలతో నిండివుండవచ్చు! ఇతనిని మీరు కొంచెం కనిపెట్టి చూస్తూ ఉండండి. మరి నాకు సెలవు."

సులోచన కారులో వెళ్ళిపోయింది. అరుణ్ విషయంలో సులోచన యింత ప్రత్యేకశ్రద్ధ యెందుకు తీసుకుంటున్నదా అని ఆలోచిస్తూ రాధ ముందుకు నడవడం ప్రారంభించాడు.

* * * * *

సులోచన అప్పుడే స్నానంచేసి పత్రిక చదువుతోంది. సూర్యుని లేత కిరణాలు కిటికీ చువ్వల్లోంచి గదిలోకి వస్తున్నై. చల్లనిగాలి మనస్సుకు ఉల్లాసాన్ని కలిగిస్తోంది. ఈ సమయంలో రాఘవ ప్రవేశించి "నాట్యమండలి కవిగారు వచ్చారు" అని చెప్పింది. ఆమె చదువుతున్న పత్రికను విడిచిపెట్టి వెంటనే హాలులోకి వచ్చింది.

"నమస్తే అరుణ్ !"

"నమస్తే! నన్ను మీరు రమ్మన్నారని రాధ చెప్పాడు." ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు.

"ఆ మధ్య మీరు ఒకసారి మా యింటికి వచ్చారట యెందుకు ?"

"అప్పుడు కొంచెం అవసరం వుండి వచ్చాను. అతికష్టం మీద ఆ అవసరం తీరిందిలెండి !"

"అయితే అవసరం తీరితే యిక ఆ మనుషులతో మాట్లాడరన్నమాట !" అతని వైపు కొంటెగా చూస్తూ అంది.

ఈ సమయంలో రాఘవ రెండు ప్లేట్లలో బిస్కట్లు, కాఫీ తీసుకువచ్చి టేబిలు మీద పెట్టింది. కాఫీతాగుతూ సులోచన అంది "నా సహాయం కావలసివుంటే మీరెప్పుడూ సందేహించకండి."

"నాకు సాధారణంగా అటువంటి అవసరాలు కలుగవులెండి" అన్నాడు కాఫీగ్లాసు టేబిలు మీద పెడుతూ. ఒక క్షణం ఆగి "నాట్యమండలిలో కొంచెం పని వుంది. వెడతాను" అన్నాడు అరుణ్.

"పాపం ! మీరు ఒంటరిగా వున్నట్టున్నారు. ఏం తోస్తుంది. మా యింటికి వస్తూవుండండి. నేను మంచిపత్రికలన్నీ తెప్పిస్తూ వుంటాను. కాలక్షేపం అవుతుంది" అంది సులోచన.

ఈ మాటలకు అరుణ్ ఆమెవైపు మౌనంగా చూశాడు.

"నావంటి దాని యింటికివస్తే లోకం ఏమైనా అంటుందని సందేహిస్తున్నారా ?" ఆమె ప్రశ్నించింది.

ఈ ప్రశ్నకు అరుణ్ కలవరపడి "లేదు. లేదు. నాకు లోకం అంటే భయం లేదు. మనం సరైన మార్గాన్ని నడిచేటప్పుడు లోకానికి జడవ వలసిన అవసరం ఏమి వుంటుంది. నాకు ఎవరింటికీ వెళ్ళే అలవాటు లేదు. అయినా వస్తూ వుంటాను. ఇప్పటికి సెలవు;"

అతను వెళుతున్న వైపు చూస్తూ "ఇటువంటి వింత మనుషులు లోకంలో వుంటారా ?" అనుకొంది సులోచన. డాంబికంలేని మనిషి. వయస్సులో చిన్నవాడు. అదే వయస్సులోవున్న నాట్యమండలి యువకులు విలువైన సూట్లు వేసుకొని రోజు రోజుకూ మారే కొత్త ఫేషన్లతో కనిపిస్తూ వుంటే, అరుణ్ మాత్రం ఎప్పుడూ ఒకే రకంగా కనిపిస్తాడు. ఆ లాల్చీ, పంచె మినహా ఏ వేషం వెయ్యడు. ఎప్పుడూ అర మోడ్పు కన్నులతో ఏవో వూర్ధ్వలోకాలను చూస్తున్నట్లు కనిపిస్తాడు. అతని ముఖంలో ఏదో ఆకర్షణవుంది. మాట్లాడేప్పుడు అతని ముఖం మరీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది;

ఆ రోజునుండి సులోచన యింటికి వెళ్ళడం కూడా అరుణ్ తన దైనిక కార్యక్రమంలో వేసుకున్నాడు. ప్రతిరోజూ బీచినుండి సులోచన యింటికి వెళ్ళి పత్రికలు చదివి ఆమె అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పిరావడం అతనికి పరిపాటి అయ్యింది — కొన్ని నెలలు గడిచినవి. సులోచనకు అరుణ్ దగ్గర చనువు అధికం కాసాగింది. అతని అభిరుచుల్ని చాలావరకూ కనిపెట్టింది. సులోచనపై ఎన్నో ఆశలు పెట్టుకొని వున్న నాట్యమండలి యువకులకు వీరి ప్రవర్తన ఈర్ష్య కలిగించసాగింది. సులోచన సంసార స్త్రీ కాదు: ఒకనటి; సర్వాంగ సుందరి: ఆమెకు వెనుక దక్షత ఎవరూలేరు. కనుక సులోచన తనకు అందుబాటులో వున్నట్లే ప్రతియువకుడూ అపోహపడ్డాడు. ప్రస్తుతం ఆమె ప్రవర్తన చూస్తే వారి ఆశలు చాలావరకూ విఫలమైనట్లే కనిపిస్తున్నవి. సౌందర్యంలోనూ, నాగరికతలోనూ తమ కంటే తక్కువ వాడైన అరుణ్ పై ఆమె అనురాగం చూపిస్తున్నదంటే ఆ యువకు లందరికీ ఆశ్చర్యంగానే వుంది. వారందరికీ ఒకే సందేహం కలిగింది. సులోచన అరుణ్ లో ఏమి చూసి ప్రేమిస్తున్నట్లు ? ఈ విషయం రంగారావుగారి వరకూ వెళ్ళింది. ఆయన మొదట నమ్మలేదు. తరవాత ఒకసారి రాఘవను పిలిపించి అడిగారు.

"అరుణ్ రోజూ మీయింటికి వస్తూవుంటాడట యెందుకు?"

"కొంతసేపు పేపర్లు చదివి అమ్మగారితో మాట్లాడి వెళ్ళిపోతూవుంటారు."

"ఏమిటో మాటలు!"

"ఏమో ! నాకు తెలియదండి!"

"రాఘవా ? నీకో రహస్యమైన పని చెబుతాను. అది చేశావా నీకు వంద రూపాయలు బహుమతి."

"ఏమిటో చెప్పండి!" అంది ఆశగా !

"సులోచన అటువంటి దర్శకుడితో సంబంధం పెట్టుకుంటే యేమిటి లాభం? ఆమె ప్రత్యేకం నాతో వుంటే నెలకు మరో రెండు వందల రూపాయలు యిస్తాను యిదెలాగైనా కుదిర్చావంటే నీకు బహుమతి దొరుకుతుంది."

"ఆమెతో యిటువంటి మాటలు చెప్పడం అంటే నాకు భయం. అయినా చెప్పి చూస్తాను." అంది రాఘవ.

"చెప్పి చూడడం కాదు. తప్పకండా నెరవేరేటట్లు చూడాలి. ప్రస్తుతం అవసరానికి వుంటుంది తీసుకో." అని ఆమెకు ఒక పది రూపాయల నోటు తీసి యిచ్చాడు. ఆ నోటు తీసుకొని సంతోషంతో రాఘవ వెళ్ళిపోయింది.

ఇది జరిగిన రెండవ రోజున రిహార్సల్సు అయిన తరవాత సులోచన అరుణ్‌తో కలిసి కారులో వెళ్లడం, రంగారావు స్వయంగా చూశాడు. అతనికి చాలా ఈర్ష్య కలిగింది. కవికి నాట్యమండలిలో ఉద్యోగం తీసేస్తే...

* * * * * * *

"బాబూ మీనాన్నగారి అడ్రసు యిప్పుడైనా చెప్పు, ఉత్తరం రాయిస్తాను. నీస్థితి చూస్తూవుంటే నాకు చాలా భయంగావుంది." గుండె నొప్పితో బాధ పడుతున్న అరుణ్‌ను చూసి అంది ముసలి నౌకరు.

"వద్దు నరసమ్మా! నాన్నగారికి ఈ వార్త తెలియచేసి వారిని బాధపెట్టడం తప్ప లాభమేమీ లేదు" అన్నాడు బాధగా.

"బాబూ చదువుకున్న వాడివి కూడాను యింత కఠినంగా వుండడం న్యాయమా?"

"నా ఉద్దేశ్యం నీకు తెలియదు మామ్మా!" అన్నాడు నిట్టూర్పు విడిచి.

ఈ సమయంలో సులోచన రాధ వచ్చారు అరుణ్ స్థితి చూసేసరికి వాడిద్దరకూ చాలా ఆశ్చర్యం కలిగింది.

"యింత ప్రమాదంగా ఉన్నా నాకెందుకు కబురు పంపలేదు అరుణ్?" కోపంగా ప్రశ్నించింది.

"అలా బాధ పడతానంటారేకాని యెవరికీ చెప్పొద్దంటారమ్మా! మీకే కాదు వారి నాన్నగారికి ఉత్తరం రాయిస్తానన్నా అడ్రసు చెప్పరు" అంది నౌకరు.

"రాధా! మనం ఆలోచిస్తూ కూర్చుంటే లాభంలేదు. మీరు వెళ్లి డాక్టరు రఘునాధరావుని తీసుకురండి!"

రాధ వెంటనే డాక్టరుకోసం వెళ్ళాడు.

మూడు రోజులనుండి అరుణ్ సులోచన యింటికి వెళ్ళడం లేదు. కారణం యేమిటో తెలుసుకుందామని ఆమె రాధతో కలిసి వచ్చేసరికి యీదృశ్యం కనిపించింది. అరుణ్ విషయమై ఆమె ప్రౌఢ హృదయంలో యేవేవో కోరికలు స్థిరపడిపోయి వున్నవి. అతని పరిస్థితి ఆమెకు భయం కలిగిస్తోంది. అతని ప్రక్కను

కూర్చొని నుదిటిపై చెయ్యివేసింది. వెచ్చగా కాలుతోంది. చల్లటి కరస్పర్శకు అతను కళ్లు తెరిచాడు. అప్పుడే ఆమె కళ్లనుండి వెలువడిన అశ్రుబిందువులు అతనికి కనిపించినవి. తిరిగి కళ్లు మూసుకున్నాడు. బయట బూట్లచప్పుడు విని సులోచన లేచి నుంచుంది. రాధ డాక్టరుతో ప్రవేశించాడు. డాక్టరు పరీక్షచేసి మందు యిచ్చాడు. సులోచన పర్సులోంచి రెండు పదిరూపాయల నోట్లుతీసి డాక్టరుకు యిస్తూ "ఫరవాలేదంటారా డాక్టర్!" ఆత్రతగా అడిగింది. "భయంలేదు. యితనికి చాలా కాలంనుంచి గుండెజబ్బు వుండేదేమోనని నా కనుమానం. తగిన చికిత్స జరిగితే యీ పాటికిపోను. ఈయన యెందుకు అశ్రద్ధ చేశాడో తెలియదు" అన్నాడు డాక్టరు.

"ఈయన ఒక కళారాధకుడు. కళారాధకులకు యెప్పుడూ కళమీద వున్న శ్రద్ధ దేనిమీదా వుండదండి."

డాక్టరు మందిచ్చి వెళ్ళిపోయాడు. సులోచన రోజంతా పరిచర్యచేస్తూ అతని దగ్గరే కూర్చుంది. మర్నాటికి అతనికి కొంచెం గుండెబాధ తగ్గింది. సులోచన రాగానే అతను అడిగాడు. "నాకోసం యెందుకు ఇంతడబ్బు ఖర్చుపెడుతున్నారు? నేను తిరిగి యివ్వలేనన్న సంగతి తెలుసుకదా!"

"ఊరుకో అరుణ్! చేతులారా ప్రాణంమీదికి తెచ్చుకున్నది చాలక ట్రీట్మెంటు చేయిస్తున్నందుకు విచారిస్తున్నావా! గుండెనొప్పి యెంత కాలంనుంచివుంది?"

"నా గుండెజబ్బుకు వెనుక హృదయాన్ని కదిలించే విషాదగాథ ఉంది సులోచనా! నాకు ఇప్పటికీ జీవితంపై విరక్తి పోలేదు. అందుకే నేను గుండెజబ్బుకు ఒకసారీ చికిత్స చేయించలేదు."

"నీకు అంత బాధకలిగించిన విషయమేదో నాకు చెప్పకూడదా అరుణ్?"
అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"నా జీవితంలో తొలిసారిగా ఒక స్త్రీ నన్నాకర్షించింది. ఆమెకు నా కోరిక తెలియజేశాను. ఆమె అంగీకరించింది. తల్లినీ, తండ్రినీ, అందర్నీ తృణీకరించి ఆమెతో జీవితం గడప ప్రారంభించాను. అంత అందమైన స్త్రీ మోసగిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. కొద్దిరోజుల్లోనే ఆమె నా జీవితంలో యెలా ప్రవేసించిందో అలాగే నిష్క్రమించింది. పట్నం విడిచిపెట్టి సమీపంలోవున్న ఒక పల్లెచేరి ప్రచ్ఛన్నంగా జీవితం గడపడం ప్రారంభించాను. అప్పటినుండి నాలో చాలా మార్పువచ్చింది. గుండెనొప్పి ప్రారంభమయింది."

ఒక్క క్షణం మౌనంగా కూర్చుని సులోచన చెప్పడంప్రారంభించింది. "ఇంత కాలంనుండీ నీవు స్త్రీలను తప్పించుకు తిరుగుతున్న కారణం నాకు ఇప్పటికి తెలిసింది. యింత తెలివైనవాడవు ఈ విషయంలో పొరపడ్డావ్ అరుణ్! పురుషులలోమాత్రం మోసగాళ్ళూ, దుర్మార్గులూ లేరా? అలాగే స్త్రీలలోనూ వుంటారు. ఒక స్త్రీ వంచించినదని కేవలం స్త్రీల నందరినీ అనుమానించటం పొరపాటు." యీ సమ

యంలో రాధ అక్కడకు వచ్చి చాలా అవసరమైన విషయాలు మాట్లాడాలని సులోచనను తీసుకు వెళ్ళిపోయాడు.—అరుణుకు సులోచనపై ఇపుడిపుడే మంచి అభిప్రాయం కలగడం ప్రారంభమయింది. కాఫీ చేతికియిస్తూ ముసలినౌకరు "ఆ అమ్మగారు కనబడగానే బాబుముఖం యెంతో సంతోషంగా వుంటుంది" అని తను కనిపెట్టిన విషయాన్ని తెలియజేసింది.

"ఆ సాయంత్రమే అరుణ్‌కు రంగారావుగారి దగ్గరనుంచి నోటీసు వచ్చింది అతనిని ఈ రోజునుండి ఉద్యోగం లోంచి తొలగించినట్లు ఆ కాగితం మరొకసారి చూసి నవ్వుకున్నాడు అరుణ్. అతను ముసలి నౌకరుతో యిలా అన్నాడు "నరసమ్మా! ఈ రోజుతో నా బరువంతా వదిలిపోయింది. రాత్రి పాసింజరుకు వెళ్ళిపోతున్నాను. యింతకాలం నుంచి నువ్వు నాకు నౌకరీ చేసినందుకు నీకుయివ్వడానికి నా దగ్గర యీ ఉంగరం తప్ప యేమీలేదు. యిదుగో! యీ ఉంగరం తీసుకో!"

ఆమె కలవరపడుతూ "అదేం బాబూ అంత వెళ్ళిపోవలిసిన అవసరం యేమి వచ్చింది?" అంది.

"ఈ రోజునుంచి నాకు ఉద్యోగం లేదు. వృధాగా యెందుకు యిక్కడ? ఈ రాత్రే వెళ్ళిపోతున్నాను."

ఉత్సాహంతో బెడ్డింగు సూట్‌కేసు పుస్తకాలు సర్దుకున్నాడు. ప్రయాణ సన్నాహం పూర్తి అయింది. సులోచన యింటికి బయలు దేరాడు అతని ముఖంలో విచారానికి బదులు సంతోషం కనిపించడం సులోచనకు చాలా ఆశ్చర్యంగా వుంది.

"ఇవేళ చాలా ఉత్సాహంగా కనిపిస్తున్నావ్ అరుణ్" అంది.

"ఔను యీ రాత్రి పాసింజరుకు వెళ్ళిపోతున్నాను."

"యీ రాత్రే ప్రయాణమా?"

"ఉద్యోగం లేని తరవాత వృధాగా యెందుకు యిక్కడ?"

"సరే కాని అరుణ్! నీకొక కొత్త ఉద్యోగం ఏర్పాటు చేశాను. స్వీకరిస్తావా?" అంది అతని వైపుచూస్తూ.

"ఏమిటి ఆ ఉద్యోగం?"

"నేను స్థాపించిన నూతన నాట్యమండలిలో కవిగా!"

"మరి నీ ఉద్యోగమో!"

"నీ ఉద్యోగం పోయిన ఉత్తర క్షణంలోనే నా ఉద్యోగానికి రాజీనామా యిచ్చాను."

"దొంగా! యిప్పటికి నీ ఉద్దేశం నేను గ్రహించాను. యింతకాలం నుంచీ వెల్లడి చెయ్యలేదు కాని నేను మాత్రం నిన్ను విడిచిపెట్టి ఉండగలనా?" అంటూ అంత నెమ్మదిగా అయిన అరుణ్ ఆమెను ప్రబంధనాయకుడిలా గట్టిగా కౌగిలించుకొని ముద్దు పెట్టుకున్నాడు.